

పాడుబడిన థియేటర్ పై నుంచి

పడిపోయి యువకుడి మృతి

వార్త..7లో

పర్యాటకులకు విజ్ఞానం.. వినోదం 6

» నెలాఖరుకు ప్రారంభం కానున్న యుద్ధ విమానం





బాటిల్‌తో చేపల వేట! 6

» యానాం గోదావరిలో చిక్కుతున్న చేపలు

» వైరల్ అవుతున్న వీడియోలు



గోదావరిలో అరుదైన అతిథులు 6

» ఆలమూరు వద్ద పక్షుల సందడి



అక్రమార్కులను మట్టి కరిపిస్తారా..?: పోలవరం కాలువ గట్టుపై కరిగిపోయిన మట్టి మేటలు

మహా మేతలు!

పోలవరం మట్టినీ మింగేసిన వైసీపీ నేతలు

» రూ.350 కోట్లు హాంఫట్
» అక్రమార్కులపై కానరాని చర్యలు
» ప్రభుత్వం మారినా అదే తీరు
» విజిలెన్స్ విచారణకూ దూరం
» కాలవ గట్టుపై మట్టి మాయం
» పేదల స్థలాల చదును ముసుగు
» భారీగా అక్రమ మట్టి తవ్వకాలు
» రియల్‌ఎస్టేట్‌కు విక్రయాలు
» లేఅవుట్లకు తరలింపు
» కోట్లకు పడగలెత్తిన నేతలు
» కొమరగిరిలో రూ.6 కోట్లు
» ప్రభుత్వ ఆదాయానికి గండి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వందల కోట్ల విలువైన పోలవరం మట్టిని మింగేసిన అక్రమార్కులపై చర్యలకు అధికారులు ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. అప్పట్లో పేదల ఇళ్ల స్థలాలకు పోలవరం మట్టిని తవ్వి తరలించడానికి కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లు తాత్కాలిక అనుమతులివ్వగా.. ఆ ముసుగులో మొత్తం మట్టంతా మింగేశారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు తెర వెనుక ఉండి సాగించిన దందాతో కోట్లకు కోట్లు కూడబెట్టారు. అదే సమయంలో గనుల శాఖకు రాయల్టీ సైతం చెల్లించకుండా పంగనామాలు పెట్టేశారు. ఒకరకంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడింది. ప్రభుత్వం మారడంతో అక్రమార్కులపై చర్యలు తప్పవని అంతా భావించారు. కూటమి సర్కారు గద్దెనెక్కినా విజిలెన్స్ విచారణకు అతీగతీ లేకుండాపోతోంది. ఎందుకో తెలియదుగానీ అధికారుల నుంచి ప్రభుత్వానికి నివేదికలు పంపకుండా తాత్సారం జరుగుతోంది. ఇప్పటికే కాకినాడ కేంద్రంగా గడచిన ఐదేళ్లలో చోటు చేసుకున్న రేషన్ బియ్యం అక్రమాలు, టీడీఆర్ బాండ్లలో కోట్లు కొట్టేసిన దొంగలపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. కానీ అదే స్థాయిలో రూ.350 కోట్లకుపైగా మట్టిలో మెక్కేసిన దొంగలపై అసలు విచారణ దిశగా అడుగులు పడకపోవడంతో అక్రమార్కులు దర్జాగా తిరుగుతున్నారు.

మట్టంతా మింగేశారంతే..

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ వంద కిలోమీటర్లమేర విస్తరించి ఉంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం దగ్గర మొదలయ్యే ఈ కాలువ గోకవరం, కోరుకొండ, రాజానగరం, గండేపల్లి, ప్రత్తిపాడు, జగ్గంపేట, గొల్లప్రోలు, శంఖవరం, తొండంగి, తుని మండలాల మీదుగా వెళుతోంది. గతంలో ఈ కాలువను 18మీటర్ల లోతుకు వరకు తవ్వారు. దీంతో దాదాపు నాలుగు కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చింది. దీన్నంతటిని కాలువకు ఆనుకుని ఉన్న భూముల్లో 15 అడుగుల ఎత్తు వరకు మేటల రూపంలో పోగేశారు. అయితే వైసీపీ రాక ముందు టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో దీనివైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. వేసిన మట్టిదిబ్బలు వేసినట్టే ఉన్నాయి. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడికక్కడ అప్పటి అధికార పార్టీ నేతలు మట్టిపై గద్దల్లా వాలిపోయారు. ఆ మట్టిని రియల్ ఎస్టేట్ అవసరాలకు విక్రయించేశారు. ప్రధానంగా రాజానగరం, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని నియోజకవర్గాల పరిధిలో పోలవరం మట్టిని గడచిన ఐదేళ్లలో అనుమతులతో సంబంధం లేకుండా గుట్టు చప్పుడుకాకుండా పదుల సంఖ్యలో పొక్లెయినర్లు పెట్టి వేలాది టిప్పర్లతో తరలించేశారు. ఒక్కో టిప్పర్ మట్టిని రూ.8 వేలకు కాకినాడ, రూ.12 వేలకు తాళ్లరేవు, యానాం, రూ.4వేలకు పిఠాపురం, రూ.15 వేలకు కోనసీమలో అనేక రియల్‌ఎస్టేట్ స్థలాల చదునుకు విక్రయించి కోట్లు గడించేశారు. ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల పరిధిలో చెందుర్తి జాతీయ రహదారి పక్కనే పోలవరం కాలువ వెంబడి కోటిన్నర లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి మేటలు, తునిలో 70 లక్షలకుపైగా క్యూబిక్ మీటర్ల మట్టి నిల్వలను కాజేశారు. దీన్నంతటిని అప్పట్లో ముగ్గురు ఎమ్మెల్యేలు తమ అనుచరుల ద్వారా యథేచ్ఛగా తరలించుకుపోయారు. నిబంధనల ప్రకారం ఈ మట్టిని తవ్వాలంటే జలవనరుల శాఖ, గనుల శాఖకు డబ్బులు చెల్లించాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధన లేవీ పని చేయకపోవడంతో ఎవరికివారు మట్టితో కోట్లు కొల్లగొట్టారు. గనులు, జలవనరులశాఖాధికారులు కమీషన్లు పుచ్చుకుని కళ్లు మూసుకోవడంతో పోలవరం మట్టి 90 శాతానికిపైగా మాయమైపోయింది. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో ఆరున్నర కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి మాయమై పోయింది. ముఖ్యంగా ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల పరిధిలో కొండలు, గుట్టల మీదుగా పోలవరం కాలువ తవ్వడం వల్ల ఇతర ప్రాంతాలకంటే ఎక్కువ మట్టి పోగైంది. గడచిన ఐదేళ్లలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యేల హోదాలో పర్వత ప్రసాద్, దాడిశెట్టి రాజాకు చెందిన అనుచరులు పోలవరం మట్టితో రెండు జేబులూ నింపేసుకున్నారు.

మట్టి మింగేశారిలా..

పిఠాపురం నియోజవర్గం యు.కొత్తపల్లి మండలం కొమరిగిరిలో 350 ఎకరాల్లో సీఎం జగన్ చేతుల మీదుగా 2021 డిసెంబర్ 25న పేదలకు ఇళ్ల స్థలాలు పంచారు. ఈ భూములు సముద్రానికి అతి సమీపంలో ఉండడంతో చిన్నపాటి వర్షాలకు ముంపునకు గురవుతాయి. ఈ లేఅవుట్‌ను లక్షల క్యూబిక్ మీటర్ల మట్టితో చదునుచేశారు. ఇందుకు గొల్లప్రోలు మండలం చెందుర్తి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పోలవరం కాలువ మట్టిని వేలాది టిప్పర్లలో కొన్ని వారాలపాటు తరలించారు. ఈ లేఅవుట్ చదునుకు ఎంత పరిమాణంలో పోలవరం మట్టి తరలించాలనే దానిపై అప్పటి కలెక్టర్ మురళీధర్‌రెడ్డి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయలేదు. కానీ చదును ముసుగులో అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి వేలాది టిప్పర్లలో పోలవరం మట్టి తరలించారు. వాస్తవానికి పోలవరం మట్టిని ఇళ్ల స్థలాల అవసరాలకు ప్రభుత్వం తాత్కాలిక అనుమతులు ఇచ్చినప్పుడు రోజుకు ఎన్ని టిప్పర్లు మట్టి తరలిస్తున్నారు? అసలు ఎంత తవ్వుతున్నారు? వంటి వివరాలు అధికారులు లాగ్‌బుక్‌లో నమోదుచేయాలి. కానీ అప్పట్లో ఇదేదీ జరగలేదు. తవ్వుతున్న మట్టిలో ప్రభుత్వ అవసరాలకు ఎంత వెళ్తుంది? రియల్ ఎస్టేట్ అవసరాలకు ఎంత పంపుతున్నారనేది పట్టించుకోలేదు. దీంతో అప్పట్లో కాకినాడ కీలక నేత ఒక్కరే పోలవరం మట్టిలో రూ.6 కోట్ల వరకు మింగేశారు.

రూ.350 కోట్లు వస్తాయని లెక్క.

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖజానాకు నిధులు సమకూర్చడం కోసం ఉమ్మడి ఉభయ గోదావరి, విశాఖ జిల్లాల్లో 12కోట్ల క్యూబిక్‌మీటర్ల పోలవరం మట్టిని విక్రయించి రూ.900 కోట్ల ఆదాయం రాబట్టాలని 2019లో భావించింది. ఈ మేరకు మంత్రుల కమిటీ ఏర్పాటుచేసి అంచనా వేయించింది. ఒక్క ఉమ్మడి తూర్పుగోదావరిలోనే మట్టిని వేలం వేస్తే రూ.350 కోట్ల వరకు రాబట్టవచ్చని అధికారులు లెక్కగట్టారు. మట్టిని విక్రయించడానికి వీలుగా రాష్ట్ర గనులశాఖ పరిధిలోకి పోలవరం కాలువలను తీసుకురావాలని అప్పట్లో మంత్రుల సమావేశం నిర్ణయించింది. ఆ తర్వాత వేలం విషయం ప్రభుత్వం మర్చిపోయింది. దీంతో ఐదేళ్లలో వైసీపీ నేతల దోపిడీతో మట్టి ద్వారా ఖజానాకు రావలసిన కోట్లు నేతల జేబుల్లోకి వెళ్లిపోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో పోలవరం మట్టి మేతపై విచారణ జరుగుతుందని అంతా భావించారు. పైగా అసెంబ్లీలోను మట్టి మాఫియా అంశంపై చర్చ జరిగింది. కానీ ఇప్పటివరకు విజిలెన్స్ అధికారులు విచారణకు రంగంలోకి దిగలేదు. పోలవరం మట్టి మాయం ద్వారా గనులశాఖ రాయల్టీ ఆదాయానికి గండిపడిందనే కోణంలో దర్యాప్తు జరుగుతుందని అధికారులు చెప్పినా, ఇంతవరకు అసలు ఉలుకుపలుకూ లేదు. ఇప్పటికే కాకినాడలో రేషన్ మాఫియా అంతు తేల్చడానికి ప్రభుత్వం సిట్‌ను నియమించి దర్యాప్తు చేయిస్తోంది. కాకినాడలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై విజిలెన్స్ విచారణ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పోలవరం మట్టి అక్రమాలపైనా విజిలెన్స్‌తో విచారణ చేయించాల్సిన అవసరం ఉంది.

ఒకరోజు ముందుగానే పింఛన్లు

అమలాపురం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూలేని విధంగా మళ్లీ మరోసారి ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జనవరి 1 బుధవారం అయినప్పటికీ నూతన సంవత్సరంలో ఆనందోత్సాహాలతో పెన్షన్‌దారులు గడపాలన్న లక్ష్యంతో ఒకరోజు ముందుగానే డిసెంబరు 31న పెన్షన్ల పంపిణీకి ఆదేశాలు జారీ చేసినట్టు డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో 2,38,012 మంది లబ్ధిదారులకు రూ.100.04 కోట్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. జిల్లాలో అత్యధికంగా అమలాపురం రూరల్ మండలంలో 12,129 మంది పెన్షన్‌దారులకు రూ.5.03 కోట్లు అత్యల్పంగా ముమ్మిడివరం నగర పాలక సంస్థలో 3,029 మంది పెన్షన్‌దారులకు రూ.1.29 కోట్లు పెన్షన్లగా అందించనున్నారు. 31వ తేదీన పెన్షన్లు పంపిణీ చేసేందుకుగాను ముందుగానే 30వ తేదీన బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకునే విధంగా ఆయా పంచాయతీల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

ఘనంగా స్వాతినక్షత్ర పూజలు



అష్టోత్తర కలశ పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో గురువారం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్ర పూజలు ఘనంగా జరిగాయి. తొలుక అర్చకులు కలశను శిరస్సుపై ధరించి ఆలయ ప్రదక్షిణ అనంతరం 108 కలశలతో విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం బీచ్ మూడు రోజులు పాటు ఓ ప్రతిష్టాత్మక క్రీడా సంగ్రామానికి వేదిక కానుంది. జాతీయ స్థాయి ఆహ్వాన బీచ్ మహిళా వాలీబాల్ పోటీలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. ఎనిమిది రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవుతున్నారు..

6లో

సై

నేటి నుంచి ఎస్.యానాంలో డే అండ్ నైట్ మహిళా నేషనల్ బీచ్ వాలీబాల్ టోర్నమెంటు

ఎనిమిది రాష్ట్రాల నుంచి ప్లేయర్ల రాక

సిద్ధమైన క్రీడా ప్రాంగణం

ప్రారంభోత్సవానికి హాజరుకానున్న మంత్రులు

ఎస్సీ, ఎస్టీలపై దాడులకు పాల్పడిన వారిపై

కఠిన చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. అట్రాసిటీ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఎస్సీ, ఎస్టీ దురాగతాల నివారణ చట్టం అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులు సత్వరమే పరిష్కరించి తగు న్యాయం జరిగే విధంగా రెవెన్యూ, పోలీసు, న్యాయ వ్యవస్థలు కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాల సమాచారాన్ని క్షేత్రస్థాయిలో విచారించి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల సత్వర విచారణకు అవసరమైన ధ్రువపత్రాలు ఎప్పటికప్పుడు తహశీల్దార్లు జారీ చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 95 కేసులు నమోదు కాగా వాటిలో ప్రాథమిక విచారణ దశలో 52 కేసులు, చార్జీషీటు దశలో 49 కేసులు, పోస్టుమార్టం దశలో 2 కేసులు ఉన్నాయన్నారు. ఆయా కేసుల్లో బాధితులకు రూ.81.25 లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.30 లక్షల మేర మాత్రమే ఇటీవల నిధులు మంజూరయ్యాయన్నారు. కోనసీమ జిల్లాకు ఎస్సీ, ఎస్టీ కోర్టు మంజూరైందని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న రుణ సదుపాయాలు, ఆయా కాలనీలకు ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా జలజీవన్ మిషన్ నుంచి ప్రతీ ఇంటికి కుళాయిలు వేయాలన్నారు. పీఎం అజయ్ కార్యక్రమం ద్వారా మండలానికి నాలుగు చొప్పున యూనిట్‌లు గ్రౌండ్ చేయాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, డ్వామా, పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ పోలీసు అధికారులు తమ స్టేషన్లకు వచ్చిన ఫిర్యాదులపై రాజీపడాలనే ధోరణిని ప్రదర్శిస్తుండడంతో మరలా అవే కేసులు పునరావృత్తమై జటిలంగా మారుతున్నాయన్నారు. తప్పుడు కేసుల విషయంలో ఏ కారణాల వల్ల ఆయా కేసులను తిరస్కరించారో కూడా తెలియచేయాలని స్పష్టం చేశారు. అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, అదనపు ఎస్పీ ప్రసాద్, ఇన్‌చార్జి డీఆర్వో కె.మాధవి, ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల, జిల్లాస్థాయి అధికారులు, డీఎస్పీలు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్, పక్కన జాయింట్ కలెక్టర్ నిషాంతి, ఎమ్మెల్యే అయితాబత్తుల

సీఎస్సార్ నిధులతో పనులకు అంచనాలు రూపొందించాలి..

జిల్లాలో చమురు, సహజ వాయువుల నిక్షేపాలను వెలికితీసి వ్యాపారాలు నిర్వహిస్తున్న సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్సార్) నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అంచనాలు రూపొందించాలని ఆయా శాఖల ఇంజనీర్లను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. అంచనాల రూపకల్పనకు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులు తెలిపిన పనులకు సంబంధించి అంచనాలు రూపొందించాలన్నారు. సముద్ర ముఖద్వారం వద్ద డ్రెడ్జింగ్ పనులు చేపడుతూ పంటలకు ముంపు బెడద నివారణా చర్యలు చేపట్టాలన్నారు. అధునాతన డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆధారంగా చేసుకుని కాల్వలు, డ్రెయిన్ల ఆక్రమణలను గుర్తించాలన్నారు. మౌలిక సదుపాయాలైన రోడ్లతో పాటు విద్యా సంస్థల్లో మౌలిక వసతులకు అంచనాలు రూపొందించి మంజూరు నిమిత్తం చమురు సహజ వాయువుల సంస్థలకు సమర్పించాలని జిల్లా అర్థ గణాంకాధికారిని ఆదేశించారు. సమావేశంలో సీపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.రామకృష్ణారెడ్డి, డీఈఈ పీఎస్ రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

రాయవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో పవిత్రోత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయదుర్గా అమ్మవారికి, శ్రీదేవి , భూదేవి సమేత విజయవేంకటేశ్వరస్వామికి వైఖానస పండితులు పూజలు నిర్వహించారు. అనంతరం పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేసి హోమాలు జరిపారు. పవిత్రోత్సవాల విశిష్టతను వేదపండితులు భక్తులకు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకటకామేశ్వరి, పెద్దపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ, పీఆర్వో బాబి పాల్గొన్నారు.

ఆటో బోల్తా 7

ఒకరి మృతి..ఇద్దరికి తీవ్రగాయాలు



7లో

ఫిబ్రవరి 4 నుంచి అంతర్వేదిలో కల్యాణోత్సవాలు

బరితెగించేస్తున్నారు..

అధికారులు ఏర్పాటు చేసిన గడ్డర్లు ధ్వంసం చేసి ఇసుక తరలింపు

కట్టుంగ ఇసుక రీచ్‌లో అక్రమ తవ్వకాలు

ఆత్రేయపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): 22 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం కట్టుంగ ఇసుక రీచ్‌లో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. కొద్దిరోజుల క్రితం ఈ రీచ్‌లో అక్రమార్కులు చొరబడి వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించుకుపోయారు. ఒక చోట ఇసుకను నిల్వ చేసి లారీల ద్వారా అమ్మకాలు సాగించారు. ఇసుక లారీ రూ.10 వేల నుంచి రూ.12వేలకు అమ్మకాలు జరిపి లక్షలాది రూపాయలు అర్జించి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై జిల్లా అధికారులు తీవ్రంగా స్పందించారు. ఆర్డీవో శ్రీకర్ ఆదేశాల మేరకు అక్రమార్కులు చొరబడకుండా ర్యాంపు వద్ద సిమెంట్, ఇనుప గడ్డర్లను నిర్మించి అక్రమాలకు చెక్‌పెట్టారు. అలాగే అక్రమ నిల్వలను గుర్తించి ఇసుకను సీజ్ చేసి పంచాయతీకి తరలించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం అక్రమార్కులు ర్యాంపు వద్ద గడ్డర్లను ధ్వంసం చేశారు. ర్యాంపులోకి చొరబడి ఇసుకను తరలించి సొమ్ములు చేసుకున్నారు. ఈ విషయంపై వీఆర్వో హైమా రెవెన్యూ ఉన్నతాధికారులకు వివరించారు. తహశీల్దారు రాజేశ్వరరావు ఆదేశాల మేరకు వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇసుక అక్రమార్కులపై ప్రభుత్వం కొరడా ఝళిపించి కూటమి ప్రతిష్ఠను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



రీచ్‌లో ఏర్పాటు చేసిన గడ్డర్లు ధ్వంసం



ఆత్రేయపురం మండలం కట్టుంగ ఇసుక ర్యాంపులో అక్రమార్కులు ఇసుకను తరలించిన దృశ్యం

పర్యాటకులకు.. వినోదం.. విజ్ఞానం


కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో సందర్శకులకు విజ్ఞానం పంచనున్న యుద్ధ విమానం



సాయం సమయాన.. సాగరతీరాన.. ఆహ్లాదకర వాతావరణంలో గడపాలంటే కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు వెళ్లాల్సిందే.. అక్కడి అందాలను తిలకించడానికి విచ్చేసే పర్యాటకులకు ఇకపై యుద్ధ విమానం మ్యూజియం స్వాగతం పలకనుంది. భారత నావికాదళానికి రక్షణ రంగంలో 28 ఏళ్లపాటు సేవలందించిన టీయూ-142 యుద్ధ విమానం మ్యూజియం జిల్లావాసులకు కనువిందు చేయనుంది. అసంపూర్తి నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఈనెలాఖరులోపు సందర్శకులకు మ్యూజియాన్ని తిలకించేందుకు అనుమతి ఇవ్వనున్నారు. ఈ విమాన మ్యూజియంపై ప్రత్యేక కథనం.

- నెలాఖరుకు ప్రారంభం కానున్న టీయూ 142 యుద్ధ విమానం
- వినియోగంలోకి రానున్న ఎన్టీఆర్ బీచ్ యుద్ధ విమాన మ్యూజియం

(ఆంధ్రజ్యోతి-సర్పవరం జంక్షన్)

ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. దేశ రక్షణ, భద్రత కోసం భారత త్రివిధ దళాలు అందిస్తున్న సేవలపై చిన్నారులు, విద్యార్థులు, సందర్శలకు విజ్ఞానం, వినోదం పంచేందుకు ఎన్టీఆర్ బీచ్‌లో రెండెకరాల స్థలాన్ని కేటాయించారు. అక్టోబరు, 2020లో గోదావరి అర్బన్ డెవలెప్‌మెంట్ సంస్థ (గుడా) రూ.5.89 కోట్ల నిధులతో టీయూ-142 ఎం యుద్ధ విమాన మ్యూజియం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బిల్లుల మంజూరులో జాప్యం, అసంపూర్తి నిర్మాణ పనుల కోసం రూ.9.03 కోట్లతో ఇతర చిల్డ్రన్స్ పార్కు, బ్యూటిఫికేషన్, విద్యుదీకరణ తదితర పనులు చేపట్టారు. యుద్ధ విమాన మ్యూజియం అసంపూర్తి నిర్మాణ పనులు పూర్తి


సిద్ధమైన పార్కుప్రాంగణం

ప్రధాన ఆకర్షణగా మ్యూజియం

టీయూ-142 యుద్ధ విమానాన్ని రష్యా నుంచి కొనుగోలు చేశారు. కార్గిల్ యుద్ధంలో విశేష సేవ లు అందించింది. ప్రపంచంలోనే అతి భారీ, పురాతన యుద్ధ విమానాల్లో ఒకటైన టీయూ-142 ఎం ఎయిర్ క్రాఫ్ట్ భారత నావికాదళం వైమానిక విభాగంలో 28ఏళ్లపాటు దేశానికి సుదీర్ఘకాలం సేవలు అందించింది. సముద్ర తీరంలో గస్తీ, జలాంతర్గామి నిరోధక సేవలు అందించడంలో తరుపు ముక్కగా పేరు గాంచింది. ఇది 2017లో నేవీ నుంచి ఈ యుద్ధవిమానం తప్పుకుని తమిళనాడు అరక్కోణం బేసల్ ఎయిర్‌స్టేషన్ ఐఎన్ఎస్ రాజసంలో విశ్రాంతి తీసుకుంటుంది. ఒక్కసారి ఫ్యూయల్ నింపుకుని ప్రపంచ దేశాలను 16 గంటల్లో చుట్టి వచ్చే సామర్థ్యం దీని సొంతం. గంటకు 925 కిలో మీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. విమానం పొడవు, వెడల్పులు 50 మీటర్లు, రెక్కల పొడవు 50 మీటర్లు ఉంటుంది. దీని బరువు 90వేల కిలోలు ఉండడం విశేషం. ఈ పురాతన యుద్ధ విమానాన్ని తమిళనాడు నుంచి కాకినాడ బీచ్‌కు 14 భారీ వాహనాల ద్వారా తెనేజా ఏరోస్పేస్ లిమిడెట్ సంస్థ తీసుకువచ్చి మ్యూజియంలో పొందుపరిచింది. విమానంలోకి ప్రవేశించే ముందు లోపలనుంచి వివిధ పరికరాలు, విమాన భాగాలను తిలకించవచ్చు. సోనా బాయ్స్ ప్రొపెల్లర్, ఇంజన్, సర్వేకల్ కిట్, యాంటీ జలాంతర్గమి క్షిపణి, డేట్ రికార్డర్ పరికరాలు, విమానంలోనికి ఎక్కేందుకు ఫ్లైట్ సిమ్యులేటర్ ప్లాట్‌ఫారం ఉంది. యుద్ధ సమయంలో విమానాలను వినియోగించే తీరు, ఆయుధాల నిల్వ, వాటిని ఏవిధంగా ప్రయోగిస్తారు. విమాన టేకాఫ్, దేశానికి అందించిన సేవలు వివరాలు తెలిపే ల్యాండింగ్ డిస్‌ప్లే, వీడియో, ఆడియో తదితర సమాచార వ్యవస్థ, గేమింగ్ జోన్, విజ్ఞానం అందించనున్నారు.

చేయకుండానే ఎన్నికల ముందు జనవరి 2024లో వైసీపీ ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించారు. మ్యూజియం చుట్టూ గ్రీనరీ, బ్యూటిఫికేషన్, చిన్నారుల పార్కు, విద్యుద్దీకరణ తదితర నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో యుద్ధ విమాన మ్యూజియం సందర్శకులకు అందని ద్రాక్షలా మిగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కృషితో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, నగర పాలక సంస్థ కమిషనర్, కౌడా ఇన్‌చార్జి వీసీ భావన చొరవతో ఎట్టకేలకు పూర్తిస్థాయిలో యుద్ధ విమాన మ్యూజియం నిర్మాణ పనులు పూర్తి చేశారు. డిసెంబరు నెలాఖరు నాటికి దీన్ని సందర్శకులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పూర్తిస్థాయిలో మ్యూజియం రెడీ

యుద్ధ విమాన మ్యూజియం అసంపూర్తి నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాయి. విమానం లోపల విద్యుద్దీకరణ, ఏసీ పూర్తి చేశాం. ప్రాంగణంలో చిన్నారులకు వినోదం పంచేందుకు పచ్చదనంతోపాటు పార్కు అభివృద్ధి, సుందరీకరణ పనులు పూర్తయ్యాయి. ఎన్టీఆర్‌బీచ్ నుంచి యుద్ధ విమాన మ్యూజియానికి స్వాగతం పలికేలా స్వాగత ద్వారం ఏర్పాటు చేశాం. ప్రవేశ ద్వారం నుంచి విమాన మ్యూజియం వరకు ఇరువైపులా రహదారిని అందంగా తీర్చిదిద్దాం. అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేశాం. జిల్లా కలెక్టర్, కౌడా వీసీ, కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెలాఖరుకు మ్యూజి యం ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకుంటున్నాం.

-జి.శ్రీనివాస్, కౌడా ఏఈ, కాకినాడ

పచ్చదనం ఉట్టిపడేలా పార్కు

ఈ మ్యూజియం ప్రాంగణంలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా పార్కు ఏర్పాటుచేశారు. చిన్నారులు, పెద్దలు, యువతను ఆకట్టుకునేలా పచ్చదనం, వివిధ రకాల వెజిటబుల్స్ పండ్లు, ఉడ్ కర్రలు అందంగా ఏర్పాటుచేశారు. చిన్నారుల పార్కులో 2009లో సర్వీసులో రిటైర్‌మెంట్ తీసుకున్న హెచ్‌పీటీ-32 విమానాన్ని ఏర్పాటు చేశారు. ఇది ప్రైమరీ ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్. పైలట్లకు శిక్షణ ఇచ్చే చిన్న విమానం. దీన్ని యుద్ధ విమాన మ్యూజియం ప్రాంగణంలో ఏర్పాటుచేశారు.



హెచ్‌పీటీ-32 ప్రైమరీ ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్




ఆలమూరు వద్ద గోదావరి విహరిస్తున్న అరుదైన బార్ హెడెడ్ గుస్ బాతులు

గోదావరిలో అరుదైన అతిథులు

- భూమికి మూడు వేల అడుగుల ఎత్తులో ఎగిరే పక్షులుగా గుర్తింపు
- హిమాలయాల నుంచి శీతాకాలంలో వచ్చే అరుదైన అతిథులు
- కోనసీమ జిల్లాలోని ఆలమూరు వద్ద గోదావరిలో పక్షుల సందడి

ఆలమూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): భూమికి అత్యంత ఎత్తులో ప్రయాణించే పక్షులుగా గుర్తింపు పొందిన బార్‌హెడెడ్ గుస్ బాతులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆలమూరు వద్ద గోదావరి తీరాన సందడి చేశాయి. హిమాలయ పర్వత ప్రాంతాల నుంచి శీతాకాలంలో వచ్చే అరుదైన పక్షులుగా ఈ బాతులకు మంచి గుర్తింపు ఉంది. భూమికి సుమారు 3 వేల అడుగుల ఎత్తులో ఎగరడం వీటి ప్రత్యేకత. శీతాకాలంలో కోసిన వరిపొలాలు, చిత్తడి నేలలు వీటికి ఆవాస క్షేత్రాలుగా విలసిల్లుతాయని ప్రముఖ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ఉప్పులూరి సురేష్‌కుమార్ తెలిపారు. రోజుకు వందల కిలోమీటర్ల మేర ప్రయాణం చేయడం వీటి ప్రత్యేకత. సాధారణంగా నవంబరులో రావాల్సిన ఈ పక్షులు ఈసారి ఆలస్యంగా డిసెంబరు నెలలో కనిపించినట్టు వివరించారు. ఉప్పునీటి కయ్యలు, మంచినీటి కయ్యలు, నదీతీరాలకు వీటి రాక ఉంటుందని... అయితే ఆలమూరు మండలంలో ఇవి కనిపించడం ఆనందం కలిగించే విషయమని చెప్పారు.

ప్రపంచ తెలుగు రచయితల మహాసభకు 'తరపట్ల'


సత్యనారాయణ (పాత చిత్రం)

దివాన్‌చెరువు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే 6వ ప్రపంచ తెలుగు రచయితల సభలకు తాను విశిష్ట అతిథిగా హాజరవుతున్నానని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ సహాయ ఆచార్యుడు తరపట్ల సత్యనారాయణ గురువారం తెలిపారు. విద్యారంగ ప్రతినిధుల సభలో పాల్గొని 'కనుమరుగవుతున్న మన జానపద కళా సంపద పరిరక్షణ-ప్రణాళికలు' అంశంపై ప్రసంగిస్తానని చెప్పారు. ప్రపంచ వేదికలపై మనగొంతు వినిపించాలని, అదొక గొప్ప సందేశం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. తరపట్లకు నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతిర్మయి అభినందనలు తెలిపారు.


ఒడిశా రైతులకు మొక్కల గురించి వివరిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి సుధీర్‌కుమార్

పూల పరిశోధనా కేంద్రాన్ని సందర్శించిన ఒడిశా రైతులు

కడియం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలోని పూల పరిశోధనా ప్రాంతీయ కేంద్రాన్ని గురువారం ఒడిశా రాష్ట్రం గంజాం రైతులు సందర్శించారు. పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డీవీఎస్ రాజు పూల సాగు ప్రాధాన్యం, పూల పంటల్లో ఆశించే తెగుళ్లు, చీడపీడలు వాటి నివారణ, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఫ్లోరికల్చర్ రీసెర్చ్ కేంద్రం శాస్త్రవేత్త మాధవన్ పూలమొక్కల్లో వచ్చే తెగుళ్లు, వాటి నివారణను వివరించారు. అనంతరం రైతుల బృందం కడియపులంక మల్లు పోలరాజు, గంగుమళ్ల సత్యనారాయణ నర్సరీలను సందర్శించింది. కడియం నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు, రైతుల కృషి, నర్సరీల అభివృద్ధి తదితర విషయాలను రైతులు వివరించారు. కార్యక్రమంలో మల్లు పోలరాజు, గంగుమళ్ల తాతాజీ, ఉద్యానవన శాఖ అధికారి డి. సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలకు ఆర్థిక పరిపుష్టి కల్పిస్తాం

కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

గొల్లప్రోలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను ఆర్థికంగా పరిపుష్టి చేయడంతో పాటు రైతులకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ వెల్లడించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని విశాల సహకార పరపతి సంఘం (సొసైటీ) ఆవరణలో గురువారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాల పనితీరు, వాటి బలోపేతానికి ఏ విధమైన చర్యలు తీసుకోవాలి, రైతుల అవసరాల ఏమిటి తదితర విషయాలు తెలుసుకుని తదనుగుణంగా బలోపేతం చేసేందుకు ఉద్యోగులు, రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అవసరం మేరకు వివిధ రంగాల్లో నూతన సొసైటీలు ఏర్పాటు చేస్తామన్నారు. సహకార వ్యవస్థను బలోపేతం చేసి అన్ని రంగాల్లోకి విస్తరించేలా రాష్ట్రాల సహకారంతో కేంద్రం చర్యలు చేపడుతోందని చెప్పారు. సమావేశంలో డీసీసీబీ పిఠాపురం బ్రాంచి మేనేజరు మహేష్, సూపర్‌వైజరు గోవిందు, సొసైటీ సీఈవో సూరిబాబు పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్ పోటీలకు సర్వం సిద్ధం

ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో నేటి నుంచి మహిళా నేషనల్ ఇన్విటేషన్ బీచ్ వాలీబాల్ టోర్నమెంటు

నిబంధనల మేరకు ఫ్లడ్ లైట్ల వెలుగులో డే అండ్ నైట్ మ్యాచ్‌లు... ప్రారంభోత్సవానికి హాజరుకానున్న రాష్ట్ర మంత్రులు

ఎనిమిది రాష్ట్రాల క్రీడాకారిణులు రాక

తీరంలో 20 మంది గజ ఈతగాళ్లు


ఎస్.యానాం సముద్ర తీరాన నేషనల్ బీచ్ వాలీబాల్ పోటీలకు సిద్ధమైన క్రీడా ప్రాంగణం, సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, టెక్నికల్ టీమ్



ఉప్పలగుప్తం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో ఈ నెల 27 నుంచి 29 వరకు డే అండ్ నైట్ నేషనల్‌ఇన్విటేషన్ మహిళా బీచ్ వాలీబాల్ పోటీలకు క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. ఎస్.యానాంలో టూరిజం ప్రాజెక్టును అభివృద్ధి చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చే ప్రయత్నంలో భాగంగా బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు వాలీబాల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో డై అండ్ నైట్ మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. శుక్రవారం ప్రారంభోత్సవానికి పలువురు రాష్ట్ర మంత్రులు హాజరవుతారని తెలిపారు. అమలాపురం డీఎస్పీటీ ఎస్ఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ చలమల రాజేష్ క్రీడా ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లపై గురువారం ఎమ్మెల్యేతో చర్చించారు. క్రీడా ప్రాంగణంలో టెక్నికల్ టీమ్‌కు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. సముద్ర తీరాన 20 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుతామని వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పలచోళ్ల పద్మనాభం వివరించారు. టోర్నీని తిలకించేందుకు వచ్చే క్రీడాభిమానులకు అనుగుణంగాభద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం కీలక ప్రదేశాల్లో పోలీసులను నియమిస్తామన్నారు.

ఎస్.యానాం బీచ్‌కు చేరుకోవచ్చు ఇలా..

అమలాపురం, రాజమహేంద్రవరం వైపుల నుంచి వచ్చే క్రీడాభిమానులు అమలాపురం నుంచి నేరుగా ఎస్.యానాం బీచ్‌కు రావచ్చు. కాకినాడ నుంచి వచ్చేవారు పల్లంకుర్రు రూట్లో కాట్రేనికోన నుంచి ఆర్అండ్‌బీ రహదారిలో నేరుగా ఎస్.యానాం రావచ్చు. ప్రధాన గ్రామం నుంచి బీచ్ వరకు మూడు కిలో మీటర్ల మేర సీసీ రహదారి వేశారు.

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు

ప్రతిరోజు ఆరు మ్యాచ్‌లు నిర్వహిస్తాం

గొలకోటి ఫణీంద్రకుమార్, వాలీబాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్

ఆంధ్రప్రదేశ్, గుజరాత్, గోవా, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, బెంగాల్, వేల్స్ యూనివర్సిటీ మహిళా జట్లు టోర్నమెంటులో పాల్గొంటున్నాయి. ప్రతిరోజూ ఆరు మ్యాచ్‌లు జరిగేలా ఏర్పాట్లు చేశాం. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు జరుగుతాయి. టెక్నికల్ టీమ్ సహకారంతో క్రీడా ప్రాంగణాన్ని అధునాతన విధానంలో సిద్ధం చేశాము. క్రీడాభిమానులు కూర్చుని చూసేందుకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశాము.






బాటిల్‌తో చేపల వేటలో పాల్గొన్న మత్స్యకార యువకులు, తిలకిస్తున్న జనం.. చిక్కిన చేపలు

బాటిల్‌తో చేపల వేట!

- గోదావరిలో భారీగా చిక్కుతున్న చేపలు
- వైరల్ అవుతున్న వీడియోలు

యానాం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): చేపల వేటలో యానాంకు చెందిన మత్స్యకార యువకులు కొత్త ఒరవడ సృష్టిస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తూర్పుగోదావరి జిల్లాలో అంతర్ భూభాగంగా ఉన్న కేంద్రపాలితప్రాంతమైన యానాం పర్యాటకంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ గోదావరి కలిసే సముద్ర ముఖద్వారం కావడంతో అరుదైన మత్స్య సం పద దొరుకుతుంది. ఈ సంపద యానాం మత్స్యకారులు వేటకు చిక్కడంతో వాటిని మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ముఖ్యంగా మత్స్యకారులు చేపల వేటలను వివిధ రకాల వలలు, గేలాల ద్వారా చేస్తుంటారు. అయితే ప్రస్తుతం యానాం మత్స్యకార యువకులు చేపలు పట్టడంతో కొత్త ఒరవడి అనుసరిస్తున్నారు. యానాం కనకాలపేట సమీపంలోని పుష్కర్ ఘాట్ వద్ద గల గోదావరిలో ఎప్పటిలా కాకుండా నూతన నిధానంలో చేపల వేట నిర్వహించారు. ఒక లీటర్ వాటర్, డ్రింక్ బాటిల్‌ను సగానికి కట్‌చేసి వాటికి నాలుగు వైపులా తాడుకట్టి వాటిలో మైదా పిండివేసి గోదావరిలోకి విసురుతున్నారు. బాటిల్‌లోని మైదాపిండి తినేందుకు వచ్చిన చేప (కొయ్యింగ మాత్రమే) వాటిలో ఇరుక్కుపోతోంది. వాటిని పైకి లాగుతారు. గత మూడు రోజులుగా ఈ వేట కొనసాగుతోంది. లైవ్‌ఫిష్ దొరుకుతున్నాయని ఆనోటా ఈనోట తెలియడంతో సందర్శకుల తాడికి ఎక్కువైంది. కొందరు కొనుగోలు చేసుకుని ఇంటికి పట్టుకెళ్తున్నారు.

రహదారి భద్రతపై ప్రజా చైతన్య యాత్ర


బైక్ యాత్ర బృందం సభ్యులు

దివాన్‌చెరువు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాహనాలపై ప్రయాణించే సందర్భంలో భద్రత చాలా ముఖ్యమని, ఈ విషయంలో ప్రజలను చైతన్యం చేసేందుకు తాము యాత్రసాగిస్తున్నామని హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నరేష్ తెలిపాడు. హైదరాబాద్‌కు చెందిన ఒక డాక్టర్, ఒక ఫార్మాసిస్ట్, మరో ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు చేపట్టిన బైక్ యాత్ర గురువారం తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు చేరింది. డాక్టర్ వెంకట్ కోసూరి, డాక్టర్ పిన్నింటి నరేష్, బి.వంశీ, కరణం కృష్ణచైతన్య, బాలాంత్రపు శ్రీకృష్ణ, డేనియల్ బెన్ విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో యాత్ర ప్రారంభించామని... మచిలీపట్నం, దిండి, యానాం, కాకినాడ, భీమవరం, బాపట్ల మీదుగా హైదరాబాద్ చేరుకుంటామన్నారు. యాత్ర తొమ్మిది రోజులు సాగుతుందన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్, గ్లౌజ్‌లు, జాకెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినా స్వల్ప గాయాలతో బయటపడవచ్చన్నారు. ఏపీలోని అందాలను తమ హెల్మెట్లలో అమర్చిన కెమెరాల్లో రికార్డు చేసి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ద్వారా ప్రజలకు చూపిస్తామని వివరించారు.

పుంగనూరు దూడ.. అడుగున్నరే..



పి.గన్నవరం,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకలగన్నవరంలో జెర్సీ పుంగనూరు ఆవు అడుగున్నర ఎత్తుతో పుంగనూరు జాతి దూడకు జన్మనిచ్చింది. ఈ దూడ ఎత్తు, పొడవు తక్కువగా ఉండడంతోపాటు బూడిద రంగులో ఉండడంతో స్థానికులు ఆ సక్తిగా తిలకిస్తున్నారు. ఇది టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబుకు సంబంధించినపశువులశాలలో జన్మించింది.

ఫిబ్రవరి 4 నుంచి 13 వరకు..

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణోత్సవాలు



ముహూర్తపు పత్రాన్ని ఆలయ ఏసీకి అందిస్తున్న అర్చకులు

» 7వ తేదీ శుక్రవారం రాత్రి 12.55 గంటలకు సుముహూర్తం

అంతర్వేది, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు అర్చకులు ముహూర్తం ఖరారు చేశారు. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13 వరకు స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సుముహూర్తం నిర్ణయించి ముహూర్తపు పత్రికను ఆలయ స్థానాచార్యులు, అర్చక, వేదపండితులు ఏసీ సత్యనారాయణకు గురువారం అందించారు. ఫిబ్రవరి 7వ తేదీ శుక్రవారం రాత్రి 12.55 గంటలకు స్వామివారి కల్యాణం, 8వతేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి రథోత్సవం, 12వతేదీ బుధవారం 8 గంటలకు స్వామివారి చక్రస్నానం(సముద్రస్నానం), 13వతేదీ సాయంత్రం 6 గంటలకు తెప్పోత్సవం జరుగుతాయి. పది రోజులపాటు స్వామివారికి గ్రామోత్సవాలు(వాహనసేవ) నిర్వహిస్తారు. ఇప్పటికే ఉత్సవాల టెండర్లు ఖరారై సమీక్షా సమావేశాన్ని అమలాపురం ఆర్డీవో అధ్యక్షతన జనవరి 2వ తేదీ ఉదయం 11 గంటలకు అంతర్వేది ఆలయంలో ఏర్పాటు చేసినట్టు ఏసీ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్యులు రంగాచార్యులు, సూపరింటెండెంట్ పి.విజయసారథి, కిరణ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నేత మృతి

» పాడె మోసిన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి



సాగిపాడులో టీడీపీ నేత పాడె మోస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతిచెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సోమరాజు పాడెను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మోశారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజక వర్గం సాగిపాడుకు చెందిన టీడీపీ నేత వంది సోమరాజు(70) గురువారం స్వగృహంలో గుండెపోటుతో మృతిచెందారు. ఆయన పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా, బీసీ నేతగా పనిచేశారు. ఆయన పార్థీవదేహానికి ఎమ్మెల్యే మద్దిపాటి టీడీపీ జెండా కప్పి నివాళులర్పించి పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబానికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో కొర్లపాటి రాము, జగదీష్, జ్యేష్ట శ్రీనివాసరావు,రమేష్, వేముల నాగరాజు, బండారు గనిరాజు, శ్రీధర్, మోహనరావు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని

భర్తపై భార్య ఫిర్యాదు

కేసు నమోదు చేసిన పోలీసులు

ఆత్రేయపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నంకోసం తన భర్త వేధిస్తున్నాడని ఓ భార్య పిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేశారు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలేనికి చెందిన కాయల సునీతకు 2021లో అదే గ్రామానికి చెందిన కాయల అనిల్‌కుమార్‌తో ప్రేమవివాహం జరిగింది. వీరికి మూడేళ్ల బాలుడు ఉన్నాడు. సునీత గ్రామ సచివాలయంలో వ్యవసాయ సహాయకురాలిగా పనిచేస్తోంది. భర్త కరెంట్ పనులు చేస్తుంటాడు. మద్యానికి బానిసై అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో నేరాల కట్టడికి చర్యలు

» డ్రోన్ టెక్నాలజీతో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

» ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

» కాకినాడ జిల్లాలో పోలీస్‌స్టేషన్ల తనిఖీ



పెద్దాపురం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఐజీ అశోక్‌కుమార్

పెద్దాపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన కాకినాడ జిల్లా పెద్దాపురం డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఐజీ మీడియాతో మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల కట్టడి సాధ్యమవుతుందన్నారు. ప్రజలు ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరస్తులను సులువుగా గుర్తించవచ్చన్నారు. ఈ విషయంలో ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తున్నామన్నారు. అసాంఘిక కార్యక లాపాలకు పాల్పడేవారిని గుర్తించేందుకు డ్రోన్ టెక్నాలజీ వినియోగించనున్నట్టు చెప్పారు. గంజాయి నిర్మూలన విషయంలో పలు బృందాలతో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రికార్డులను తనిఖీ చేసి వార్షిక పురోగతిపై ఆరా తీశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ డి.శ్రీహరిరాజు, సీఐలు క్రాంతి కుమార్, ఎ.కృష్ణభగవాన్, పెద్దాపురం ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

సైబర్ క్రైంపై ప్రత్యేక దృష్టి: ఐజీ

సర్పవరంజంక్షన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టుల పేరు భయభ్రాంతులకు గురి చేస్తున్న సైబర్ నేరగాళ్లపై ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఈ తరహా సంఘటనలు జరిగితే తక్షణం 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి కాకినాడ రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఐజీ విలేకరులతో మాట్లాడుతూ సైబర్ క్రైం నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వ్యక్తిగత తగాదాల నేపథ్యంలో గొల్లపాలెం మండలం శలపాక, సామర్లకోట మండలం వేట్లపాలెంలో హత్యలు జరిగాయని తెలిపారు. శాంతి భద్రత పరిరక్షణకు చిన్న తగాదాలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి త్వరగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఐజీ

'అన్నవరం'లో మార్పులపై ఈవో, ఛైర్మన్ సమీక్ష

అన్నవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో లోటుపాట్ల సవరణపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్ సిబ్బందితో ప్రకాశ్‌సదన్ సమావేశమందిరంలో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా సత్రం గదులు ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న భక్తుడికోసం 24గంటలపాటు అతనికి గది కేటాయించాలనే ఉద్దేశ్యంతో ఖాళీగా ఉంచడంతో తర్వాత వచ్చిన భక్తుడికి కేటాయించలేకపోతున్నారు. దీంతో చెక్‌ఇన్, చెక్ అవుట్ సమయం విధిగా రిజర్వేషన్ సమయంలో ఇవ్వాలని సలహాఇచ్చారు. దేవస్థానంలో నగదు రహిత సేవలు లేనందున భక్తులు పడుతున్న ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని ముందుగా ఒక ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి డిజిటల్ పేమెంట్ ద్వారా వ్రతం టిక్కెట్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈవో, మరికొందరి సిబ్బంది పరిచయ కార్యక్రమం జరిగింది. ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

రత్నగిరి వ్రత మండపంలో భక్తుడికి తీవ్ర అస్వస్థత

అన్నవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన ఒక భక్తుడు గురువారం ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆందోళన నెలకొంది. విజయవాడకు చెందిన ఏఎస్ ప్రసాద్ కుటుంబసభ్యులతో స్వామిసన్నిధికి విచ్చేసి గురువారం రూ.1500 వ్రతమండపం వద్దకు చేరుకున్నాడు. వ్రతం ప్రారంభం కాకుండానే పక్షవాతం వచ్చి బీపీ పెరిగింది. వెంటనే సిబ్బంది 108అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా రాకపోవడంతో ప్రాథమిక చికిత్స చేసి సొంతవాహనంలో దేవస్థానం ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారి చికిత్స చేయడంతో ఆయన కుదుటపడ్డాడు.

బాలికతో అసభ్య ప్రవర్తన

పాస్టర్‌పై పోక్సో కేసు

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన పాస్టర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరిజిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామానికి చెందిన పాస్టర్ దేవదాసు కుటుంబరావు ఈనెల 25వతేదీ ఉదయం మండలంలోని ఓ గ్రామంలోని ఓ ఇంట్లోకి ఎవరూ లేని సమయంలో వెళ్లాడు. 11ఏళ్ల బాలికను.. సాయంత్రం క్రిస్మస్ పార్టీకి వస్తామనిచెప్పు బలవంతంగా కౌగిలించుకుని, పలుచోట్ల చెయ్యి వేసి ముద్దు పెట్టుకున్నాడు. బాలిక తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేయడంతో కుటుంబసభ్యు లు కొవ్వూరు పట్టణ పోలీసులకు పిర్యాదు చేశారు. దీనిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

శునకాలు అడ్డు రావడంతో.. ఆటో బోల్తా



గంటిపెదపూడిలో ఆటో బోల్తా ఘటనలో మృతి చెందిన పల్లయ్య



గాయాలపాలైన వీరవేణి

» ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

» కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలో ఘటన

పి.గన్నవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటి పెదపూడిలో ప్రధాన రహదారిపై కుక్కలు అడ్డు రావడంతో ప్యాసింజర్ ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పి.గన్నవరం మండలం వైవీ పాలెం గ్రామానికి చాగంటి సతీష్ తన ప్యాసింజర్ ఆటోతో పి.గన్నవరం గంటిరోడ్డులోని వార్పు సెంటర్ నుంచి రావులపాలెం బయలుదేరాడు. ఈ క్రమంలో గంటిపెదపూడి సెంటర్ సమీపంలోకి వెళ్లేసరికి ఎదురుగా రెండు కుక్కలు చెలగాటం ఆడుతూ ఒక్కసారిగా ఆటోకు అడ్డుగా వచ్చాయి. దీంతో ఆటోను డ్రైవర్ అదుపు చేయలేకపోవడంతో రోడ్డుపై బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తోపాటు మరో ఐదుగురిలో ముమ్మిడివరం మండలం కో మానపల్లి గ్రామానికి చెందిన సవరపు పల్లయ్య(61)కు బలమైన గాయంకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ సతీష్, ప్రయాణికురాలు వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన వెల్ల వీరవేణికి గాయాలు కావడంతో 108 అంబులెన్స్ సాయంతో పి.గన్నవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వారిని అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరు మహిళలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొమ్ముబూర ఊదే పల్లయ్యది స్వగ్రామం కోమానపల్లి కాగా ఉడిమూడి సెంటర్‌లో ఆటో ఎక్కాడని తోటిప్రయాణికులు చెప్తున్నారు. కాకినాడలో ఉన్న పల్లయ్య బంధువులకు పోలీసులు సమాచారం అందించి మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

చెట్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం



సంఘటనాస్థలంలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్ఐ



సుబ్రహ్మణ్యం(ఫైల్)



వెంకటరమణ

» ఇద్దరు గిరిజన యువకులు మృతి

» కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో ఘటన

శంఖవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి సమయంలో టిఫిన్ చేసేందుకు బయటకు వెళ్లిన గిరిజన యువకులు చీకట్లో వేగంగా ద్విచక్రవాహనంతో చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి అన్నవరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

శంఖవరం మండలం పెదమల్లాపురం గ్రామానికి చెందిన బోడోజు వెంకటరమణ(18), బలుం సుబ్రహ్మణ్యం(24) పక్క గ్రామమైన వేలంగిలో టిఫిన్ చేసేందుకు బుధవారం రాత్రి సమయంలో బండిపై వెళ్లారు. అక్కడ పని పూర్తి చేసుకుని తిరిగి బైక్‌పై వేగంగా వస్తున్నారు. ఆమార్గంలో ఓచోట చెట్టును బలంగా ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రివేళలో అటుగా రాకపోకలు తక్కువగాఉండడంవల్ల ఎవరూ ప్రమాదాన్ని వెంటనే గుర్తించలేదు. రాత్రి 11గంటల సమయంలో అటుగా వెళ్తున్న గ్రామస్థులు సంఘటనా స్థలంలో ఇద్దరు యువకులు విగతజీవులుగా ఉండడం గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కానీ అప్పటికే వారు మరణించినట్లు ధ్రువీకరించారు. గిరిజన యువకుల మరణంతో కుటుంబీకులు బోరున విలపించారు. సంఘటనాస్థలాన్ని అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు పరిశీలించి మృతదేహాలను తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబాలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు. ప్రమాదానికిగల కారణాలను రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బచ్చల గంగను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడి మృతి

కొత్తపేట మండలంలో ఘటన

కొత్తపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కొత్తపేటమండలంలో చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. కొత్తపేట మండల పరిధి బిళ్లకుర్రు గ్రామశివారు నల్లావారిపేటకు చెందిన గీత కార్మికుడు బండి వెంకటరామారావు(58) గురువారం తనతండ్రి పొలంలో తాటిచెట్టు ఎక్కి గీతకు సిద్ధం చేస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తూ కాలుజారి కింద ఉన్న సిమెంట్ స్తంభంపై నేరుగా పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సావిత్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపేట ఏఎస్ఐ జీవీ కృష్ణారావు తెలిపారు.

ఏజెంట్ మోసం... గల్ఫ్‌లో నరకం

» కూటమి ప్రభుత్వం సహకారంతో మస్కట్‌నుంచి వచ్చిన మహిళ

» బాధితురాలిది కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు

తాళ్లరేవు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లిన ఆ మహిళ.. ఏజెంట్ చేతిలో మోసపోయి అక్కడ దుర్భర పరిస్థితి ఎదుర్కొంది. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా పైస్థాయికి వెళ్లడంతో కూటమి ప్రభుత్వ సహకారంతో ఆమెను తిరిగి స్వస్థలానికి తీసుకువచ్చారు.

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట గ్రామానికి చెందిన వాసంశెట్టి పద్మ 9నెలల క్రితం మస్కట్ దేశానికి వెళ్లింది. ఏజెంట్ సరైన వీసా ఇవ్వకపోవడం.. పాస్‌పోర్టు సరిగ్గా లేకపోవడంతో ఆమెకు పనిచేసే అవకాశం లేకుండా పోయింది. తినడానికి తిండి, ఉండడానికి నీడ దొరకని తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. ఆమె తన దీనస్థితిని తెలియజేస్తూ తనను రక్షించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను వేడుకుంటూ ఒక వీడియో విడుదల చేసింది. దీన్ని స్థానిక టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్, ఆ పార్టీ నేత జక్కల ప్రసాద్ గమనించి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ దృష్టికి తీసుకెళ్లారు.వారి సహకారంతో సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు మంత్రి లోకేశ్‌లకు చేరేలా సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. ఈ ప్రయత్నం ఫలించి ప్రభుత్వ పెద్దలు మస్కట్‌లో ఉన్న భారత రాయబారులను సంప్రదించారు. ఆమెను రక్షించే బాధ్యతను వారికి అప్పగించారు. దీంతో ఆమె ఈనెల 24న మస్కట్ నుంచి తాళ్లరేవులోని తన నివాసానికి చేరుకుని కుటుంబసభ్యులను కలుసుకుంది. తనకు సహకరించిన అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపింది.



వాసంశెట్టి పద్మ

పది కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరి రాజు

ఏలేశ్వరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీహరి రాజు తెలిపారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలేశ్వరం మండలంలోని యర్రవరం జాతీయ రహదారిపై కర్ణాటకకు చెందిన కారులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో కారును తనిఖీ చేశారు. అందులో పది కిలోల గంజాయిని, నాయజ్ షాషా(41) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దీనివిలువ రూ.60వేలు ఉంటుందన్నారు. సీఐ సూర్యఅప్పారావు, ఎస్ఐ రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

పాడుబడిన థియేటర్ పైనుంచి పడి..

గుర్తు తెలియని యువకుడి మృతి

» అమలాపురంలో ఘటన

అమలాపురం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎక్కడి నుంచి వచ్చాడో.. ఎలా వెళ్లాడో తెలియదు గానీ.. దశాబ్దాల కాలం క్రితం అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లిలో మూసివేసిన హనుమాన్ థియేటర్‌లోకి గురువారం గుర్తు తెలియని యువకుడు వెళ్లాడు. శిథిలావస్థలో ఉన్న భవనంపైకి చేరుకుని అక్కడినుంచి పడిపోయాడు. అతడిని 108 అంబులెన్సులో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గుర్తు తెలియని యువకుడి సమాచారం కోసం సామాజిక మాధ్యమాలతోపాటు ఇతర జిల్లాల అధికారులకు సమాచారం అందించినట్టు అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.



ఏరియా ఆస్పత్రిలో మృతి చెందిన యువకుడు

కాలువలో పడి బాలుడి మృతి



చిన్నారి అద్విత్ మృతదేహం

» తూర్పుగోదావరి జిల్లా బల్లిపాడులో విషాదం

తాళ్లపూడి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలువలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలోని బల్లిపాడు గ్రామంలో కాలువ గట్టును ఆనుకుని ఉండే ఎస్సీ కాలనీలో నివసించే తలపాకుల ఝాన్సీ రాణికి ముగ్గురు సంతానం. చిన్నవాడైన తలపాకుల అద్వితకుమార్(4) అంగన్‌వాడీ సెంటర్‌నుంచి సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చాడు. తర్వాత ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తూ కాలువలో పడి మునిగిపోయి మృతి చెందాడని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త కరోనా సమయంలో మృతి చెందగా ఇప్పుడు చిన్నకుమారుడు చనిపోయాడని ఆమె కన్నీరుమున్నీరవుతోంది. బాలుడి మరణంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

నూకాంబికా అమ్మవారికి.. వెండి ఆభరణాల బహూకరణ



వెండి ఆభరణాలతో నూకాంబికా అమ్మవారు

ఆలమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబికా అమ్మవారికి భక్తుల సహకారంతో రూ.40లక్షల విలువైన వెండి ఆభరణాలు బహూకరించారు. ముందుగా భక్తులు అమ్మ వారికి 25కిలలో వెండితో తయారు చేయించిన ఆభరణాలకు గురువారం భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహానికి అలంకరించారు. వెం డి ఆభరణాలను ఆలయ ఈవో వీర్రాజుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అందించారు.

ఆటోను తప్పించబోయి వంతెనపైనుంచి

పడిపోయిన యువకుడు



ప్రేమ్‌కుమార్ మృతదేహం

» ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

» పండక్కి దుస్తులు కొనుక్కొనేందుకు ద్వారపూడి వెళ్తుండగా ఘటన

మండపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు బట్టలు కొనుక్కునేందుకు స్నేహితుడి మోటారుసైకిల్‌పై వెళ్తూ ఓ యువకుడు ప్రమాదవశాత్తూ వంతెనపైనుంచి కిందపడి గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇది. కోనసీమ జిల్లా మండపేట రూరల్ పోలీసులు కథనం ప్రకారం.. మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన గానుగుల ప్రేమ్‌కుమార్(17) గురువారం పండక్కి బట్టలు కొనుక్కునేందుకు స్నేహితుడి వద్ద బైక్‌తీసుకుని బయలుదేరాడు. ద్వారపూడి ఫ్లైఓవర్ వంతెనపై ఆటోను తప్పించబోయి ప్రమాదవశాత్తూ వంతెనపైనుంచి కిందకు పడిపోగా బైక్ వంతెనపై ఉండిపోయింది. ప్రేమ్‌కుమార్‌ను ద్వారపూడి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం మండపేట ప్రభుత్వాస్పత్రికి.. అక్కడినుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ప్రేమ్‌కుమార్ తండ్రి చాలాకాలం క్రితం మృతి చెందాడు. తల్లి గంగాభవాని వద్ద కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విదసం ఐక్యవేదిక ప్రతినిధులు

శిరోముండనం బాధితులకు న్యాయం జరిగేదెప్పుడు?

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బెయిల్ రద్దుకు క్రాస్ అప్పీల్ చేయాలి
- అప్పీల్ చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా

అమలాపురంటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వెంకటాయపాలెం శిరోముండనం కేసులో బాధితులకు ఎప్పటికి న్యాయం జరిగేది ఎప్పుడంటూ విస్తృత దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పలువురు ప్రశ్నించారు కలెక్టరేట్ ఎదుట గురువారం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కొమ్ముకాసే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని వేదిక రాష్ట్రసమితి కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు ఆరోపించారు. బెయిల్‌పై ఉన్న త్రిమూర్తులుపై ప్రభుత్వం తరపున హైకోర్టులో తక్షణం క్రాస్ అప్పీల్ వేయాలని డిమాండ్ చేశారు. శిరోముండనం కేసులో నిందితులకు కోర్టు పద్దెనిమిది నెలలు జైలు శిక్ష విధించగా శిక్షను రద్దు చేయాలని త్రిమూర్తులు హైకోర్టులో అప్పీల్ చేయగా పోలీసు అధికారులు ఇంతవరకు క్రాస్ అప్పీల్ వేయలేదని విమర్శించారు. బాధిత కుటుంబాల పిల్లలకు ఇంత వరకు కులధ్రువీకరణ పత్రాలను రెవెన్యూ అధికారులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కాకినాడలో రేషన్ బియ్యం అక్రమార్కులను, మచిలీపట్నంలో పేర్ని నానిని కాపాడుతున్నది వైసీపీ అనుకూల అధికారులేనని ధ్వజమెత్తారు. రేవు తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో గుబ్బల శ్రీనివాసరావు, వెంటపల్లి రామకృష్ణ, బూల భాస్కరరావు, మూర మహేష్, పొలమూరి మోహన్ బాబు, బడుగు జోగేష్, శెట్టిబత్తుల తులసీరావు, అమలదాసు బాబూరావు, కోటి చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు వినతిపత్రాలు అందించారు.

జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ పరిశీలన



కొమరాడలో రికార్డులను పరిశీలిస్తున్న డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ టీమ్

మామిడికుదురు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ టీమ్ లూటుకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని కొమరాడ గ్రామంలో గురువారం ఏఎన్ఎం రికార్డులను పరిశీలించారు. వీరు ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంల గత మూడు సంవత్సరాల రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న గర్భిణిలను, బాలింతలను, కౌమార బాలికలను రప్పించి వారికి రక్త పరీక్షలు నిర్వహించి వాటిని ఆన్‌లైన్ రికార్డుల ద్వారా నమోదు చేశారు. ఆయా రికార్డులను టీమ్ సభ్యులు పరిశీలించారు. సర్పంచ్ వలవల సత్యవేణి, ఎంపీహెచ్ఈవో డి.ప్రసాద్, సీహెచ్ రాజేంద్రబాబు, కె.ఉమామహేశ్వరరావు, సీహెచ్‌వో అరుణ, ఏఎన్ఎం వై.లావణ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యానిమేటర్ల అవకతవకలపై చర్యలేవి?

- సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ధ్వజం
- ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌ను నిలదీసిన సర్పంచ్
- పలు శాఖల అధికారుల గైర్హాజరు



సమావేశంలో ఐకేపీ శ్రీనివాస్‌ను నిలదీస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

అంబాజీపేట, డిసెంబర్ 26(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని తిరిగి చెల్లించే క్రమంలో డ్వాక్రా యానిమేటర్లు అవకతవకలకు పాల్పడి లక్షలాదిరూపాయలు కాజేసి పరారవుతున్న అధికారులు పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండల పరిషత్ సమావేశంలో ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జీవీ సరోవరరావు పర్యవేక్షణలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలస్థాయి అధికారులతో ఎంపీపీ సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకేపీ ఇన్‌చార్జ్ ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతున్న మండలంలో ఎన్ని గ్రామాలకు ఎంత నిధులు ఇచ్చారని సభ్యులు నిలదీశారు. ఆ అధికారి నీళ్లు నమలడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పుల్లేటికుర్రు, గంగలకుర్రు, మాచవరం, కె.పెదపూడి గ్రామాల్లో యానిమేటర్లు, బీసీ పాయింట్ నిర్వాహకులు రూ.40లక్షలకు పైగా చేతివాటం ప్రదర్శించి పరారయ్యారని నేటికి వీరిపై చర్యలు తీసుకోలేదని సర్పంచ్ జల్లి బాలరాజు నిలదీశారు. గంగలకుర్రులో యానిమేటర్, తన భర్త రూ.10లక్షలకుపైగా డ్వాక్రా సభ్యుల నుంచి వసూళ్లు చేసి పరారయ్యారన్నారు. నేటికీ క్రిమినల్ కేసు కూడా అధికారులు పెట్టలేదన్నారు. పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంకు పరిధిలో ఇంటిగ్రా ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా బీసీ పాయింట్ నిర్వహిస్తున్న పరమట మణి గ్రామంలో ఉన్న డ్వాక్రా సంఘ సభ్యుల నుంచి బ్యాంకుకు చెల్లిస్తానని నమ్మబలికి రూ.20లక్షలకు పైగా కాజేసిందని నేటికీ ఏజెన్సీ నిర్వాహకులు సమాధానం చెప్పడంలేదని సర్పంచ్ బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్వాక్రా సంఘాల సమస్యలపై త్వరలో సమావేశం ఏర్పాటుచేసి చర్చిద్దామని ఎంపీడీవో సరోవర్ విషయాన్ని సద్దుమణిగించారు. గోకులం పథకానికి సంబంధించి వైసీపీకి చెందిన లబ్ధిదారులకు మంజూరు చెయ్యరని పుల్లేటికుర్రు పశువైద్యాధికారి జి.శ్రీనివాస్ చెబుతున్నారని, పాడిరైతులకు పార్టీలకతీతంగా అధికారులు పనిచేసి అర్హులైన వారికి మంజూరు చేయాలని మొసలపల్లి ఎంపీటీసీ నూకపెయ్యి సత్యనారాయణ పశువైద్యాధికారిని నిలదీశారు. వైసీపీకి చెందిన నేతలు, కార్యకర్తలకు ప్రభుత్వ పథకాలను మంజూరు చేయరా అంటూ ప్రశ్నించారు. దీనిపై పశువైద్యాధికారి స్పందించి వచ్చే నెలలో మంజూరు చేస్తామని సమాధానం ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ సమస్యలపై జేఈ జయశ్రీని పలువురు ప్రశ్నించారు. గ్రామాల్లో వాటర్‌ట్యాంకులను శుభ్రం చేయించి ప్రజలకు రక్షిత మంచి నీటిని అందించాలన్నారు. మండల పరిషత్ సమావేశానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో సమావేశంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, డిప్యూటీ తహశీల్దారు వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

బీసీ పాయింట్ నిర్వాహకురాలిపై చర్యలేవి : డ్వాక్రా సభ్యుల నిరసన

పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంకు పరిధిలో డ్వాక్రా సంఘ సభ్యులు చెల్లించిన సొమ్మును ఇంటిగ్రా ఏజెన్సీ నిర్వాహకులు పరమట మణి బ్యాంకుకు చెల్లించకుండా రూ.20 లక్షలు కాజేసి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకూ ఏ విధమైన చర్యలు తీసుకోలేదని డ్వాక్రా సంఘ సభ్యులు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంవద్ద పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన డ్వాక్రా సభ్యులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. తక్షణం ఇంటిగ్రా అధికారులు తమ సొమ్ము ను బ్యాంకుకు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే తాము పెద్దఎత్తున ఆందోళన చేపడతామని సర్పంచ్ జల్లి బాలరాజు హెచ్చరించారు. డ్వాక్రా సంఘాల పట్ల అధికారులకు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో డ్వాక్రా సంఘ సభ్యులు మోసపోతున్నారని సర్పంచ్ ఆరోపించారు. తక్షణం ఈవిషయంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని మహిళా సంఘ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేవారు. ఎంపీటీసీ వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ బడ్జెట్ సమావేశం

ముమ్మిడివరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ బడ్జెట్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించినట్టు నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమావేశం ఏర్పాటుచేస్తామ న్నారు. బడ్జెట్ సమావేశానికి అధికారులు, కౌన్సిలర్లు విధిగా హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు.

హౌసింగ్ పీడీగా నరసింహారావు



ముమ్మిడివరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎంవీ నరసింహారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన మదన్మోహనరావు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో నరసింహారావు ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న గృహనిర్మాణ లక్ష్యాల సాధనకు కృషి చేస్తానన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా మల్లికార్జునరావు

మలికిపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మలికిపురం ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న జి.మల్లికార్జునరావు గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవోగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఎం.బాలాజీ పదోన్నతిపై మచిలీపట్నం బదిలీ అయ్యారు. దీంతో మల్లికార్జునరావుకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అంబాజీపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ల మరమ్మ తు పనులలో ముక్కామల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ముక్కామల, ఇరుసుమండ, వ్యాఘ్రేశ్వరం, వక్కలంక, చిరతపూడి, పసుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పి.గన్నవరం: నేడు నరేంద్రపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33,11కేవీ, గంటిపెదపూడి విద్యుత్ లైన్లు మరమతుల పనులు, ఆర్‌డీఎస్ఎస్ లైన్ పనులు నిమిత్తం సబ్‌స్టేషన్ పరిధిలోని నరేంద్రపురం, కుందాలపల్లి, రాజులపాలెం, గంటిపెదపూడి, ఉడిమూడి, ఉడిమూడిలంకలు, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ తెలిపారు.

గూడపల్లిలో రెవెన్యూ సదస్సు



సమస్యలపై వినతిపత్రాలు అందజేస్తున్న రైతులు

మలికిపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా ఎంతో కాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి చక్కటి అవకాశం దొరుకుతుందని మలికిపురం తహశీల్దార్ పి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం గూడపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాల క్రితం ఏర్పడిన ఎ-రిజిష్టర్ స్థానే కొత్త ఎ-రిజిష్టర్ ఏర్పాటుకు భూముల రీసర్వే ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. పలువురు రైతులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందర తాతాజీ, సుందర బ్రహ్మయ్య, కటికిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది..

అంతర్వేది, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం రామేశ్వరం, గుడిమూల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. దాళ్వా వరి ఊడ్చిన పొలాల్లో సాధారణంగా జింక్ లోపం వస్తుందని, నివారణకు రైతులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బంది, ఇరు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.



అమలాపురంలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణ, ఇజ్రాయిల్



అంబాజీపేట రంగా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రంగా ఆశయసాధనకు కృషిచేస్తాం

రంగా వర్ధంతి కార్యక్రమాల్లో నాయకులు

అమలాపురం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగ, జక్కంపూడి నాగేశ్వరరావు వర్ధంతిని గురువారం అమలాపురం నల్లవంతెన దిగువన జక్కంపూడి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగా, నాగేశ్వరరావు విగ్రహాలకు ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కాపు ఉద్యమ నాయకుడు కల్వకొలను తాతాజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీలు గన్నవరపు శ్రీనివాస్, పందిరి శ్రీహరి, నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి భరత్‌భూషణ్, కల్వకొలను ఉమా, తోరం గౌతంరాజు, అక్కల శ్రీధర్, రంగా మిత్రమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మహిపాలవీధిలో కాపునాడు సంయుక్త కార్యదర్శి అబ్బిరెడ్డి మూర్తి ఆధ్వర్యంలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా ఆశయ సాధనకు కృషి చేస్తామని రాష్ట్ర కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దూడల ఫణి, అబ్బిరెడ్డి రమేష్, పప్పొప్పుల గణేష్, బాలాజీ పాల్గొన్నారు.

రాజోలు: తాటిపాక సెంటర్‌లో కాపు నాయకులు ఉన్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ రంగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తాటిపాక గ్రామ ఉప సర్పంచ్ కటికిరెడ్డి బుజ్జి, కొమ్మూరి ఏసు, లంకలపల్లి సుబ్బారావు, యెరుబండి వెంకన్న, కటికిరెడ్డి సుబ్రహ్మణ్యం, దంగేటి దుర్గారావు, ఏపుగంటి సత్యనారాయణ, తెలగారెడ్డి వాసు, అప్పన శ్రీరామకృష్ణ, కుంచే పండు, నేదూరి శివ, కందాల రమేష్, అడ్డాల గోపి, చిన్నబుజ్జి, రంగా-రాధా మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.



రాజోలు: తాటిపాక సెంటర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

పేదల ఆశాజ్యోతి రంగా

అంబాజీపేట: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి రంగా అని పలువురు నాయకులు కొనియాడారు. రంగా వర్ధంతిని పురస్కరించుకొని అంబాజీపేట హైస్కూల్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు కొర్లపాటి గోపి, విత్తనాల శేఖర్, కొర్లపాటి కోటబాబు, దొమ్మేటి సత్యమోహన్, మైపాల తాతాజీ, మైలా ఆనందరావు, కొప్పినీడి ఈశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

పి.గన్నవరం: రంగా వర్ధంతిని పురస్కరించుకుని పి.గన్నవరం అక్విడెక్టు వద్ద స్థానిక నాయకులు అడ్డగళ్ల వెంకటసాయిరాం ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, అభిమానులు రంగాకు ఘనంగా నివాళులు అర్పించారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లంకలగన్నవరంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాలలో కోట రామమోహనరావు, నక్కా చినవెంకటేశ్వరావు, యర్రంశెట్టి సాయిబాబు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, నల్లాపెద్దకాపు, సంసాని పెద్దిరాజు, పుచ్చకాయల నరసింహమూర్తి, కోట విజయ భాస్కర్, దూనబోయిన రవిచంద్ర, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, యడ్ల ఏసుబాస్కరావు, గనిశెట్టి శ్రీనివాస్, గనిశెట్టి ఈశ్వర్, యర్రంశెట్టి నాగేశ్వరావు, వేమన గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: అల్లవరం, కొమరగిరిపట్నం, డి.రావులపాలెం గ్రామాల్లో రంగా విగ్రహాలకు కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన మండల నాయకుడు కంకిపాటి వీరబాబు, బండిగుప్తాపు రంగ, మండల బీజేపీ అధ్యక్షుడు సుంకరసాయి, వైసీపీ నేత తిక్కా ప్రసాద్, అడపా రాజారావు, బి.చిట్టివెంకన్న, కె.పెదబుజ్జి, చికిలే చిట్టిబాబు, మెరికల శ్రీను, మెరికల సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్, కేశవదాసుపాలెం కాల్వమొగ సెంటర్‌లో మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో రంగాకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్రకుమార్, పోతురాజు కృష్ణ, యెనుముల తాతాజీ, ఉండపల్లి అంజి, సత్యనారాయణ, రత్నమెమోరియల్ యూత్ సభ్యులు, వర్తకసంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: విలసవిల్లి రంగా సెంటర్‌లో గురువారం స్వర్గీయ వంగవీటి మోహనరంగా వర్ధంతిని సలాది సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్, కేలా ఏసు, నందుల సత్య, గుండుమోగుల రామకృష్ణ, నడింపల్లి నాని, పుత్సల ఏసు, నందుల మల్లేష్ పాల్గొన్నారు.

29న సత్యనారాయణస్వామి దివ్య కల్యాణం

అమలాపురం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): లోకాసమస్తా సుఖినోభవంతు ఆధ్యాత్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్ పర్యవేక్షణలో ఈనెల 29న స్థానిక శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో శ్రీఅనంతలక్ష్మి సత్యవతీదేవి సమేత శ్రీవీరవెంకటసత్యనారాయణమూర్తి స్వామివారి దివ్య కల్యాణం నిర్వహిస్తున్నట్టు సేవాసంస్థ ప్రతినిధులు తెలిపారు. స్వామివారి దివ్య కల్యాణంలో పాల్గొనేవారు ముందుగానే పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు సెల్ 9849607052ను సంప్రదించాలని కోరారు.

కార్యదర్శులకు ఫిజియోథెరపీపై శిక్షణ

అల్లవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిమ్స్ ఆసుపత్రి ఫిజియోథెరపిస్టులు ఫిజియోథెరపీ సెల్ రేడియేషన్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి ధ్యానం, వాయామాలు చేయించారు. ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, ఎవో బి.లక్ష్మణరావు, కార్యదర్శులు శంకరప్రసాద్, శిరీష, వీరబాబు, మృధుల తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

అమలాపురం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్ చోరీ కేసులో అమలాపురం రూరల్ మండలం జనుపల్లి రామలక్ష్మి కాలనీకి చెందిన అక్తర్ షబ్బర్ అలీని అరెస్టు చేసి కోర్టుకు పంపించినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు గురువారం తెలిపారు. షబ్బర్ అలీ గతంలో పోక్సో కేసులో జైలు శిక్ష అనుభవించాడు. అతనిపై మూడు కేసులు ఉన్నట్టు సీఐ తెలిపారు.

గొల్లవిల్లిలో గణితశాస్త్ర దినోత్సవం

ఉప్పలగుప్తం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి సందర్భంగా గణితశాస్త్ర వేడుకలు నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలి

- ఆర్డీవో మాధవి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

అమలాపురం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ పిండ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు వినియోగించే అల్ట్రా స్కానింగ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదేశించారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘాతో పాటు డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. గురువారం అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో మాధవి అధ్యక్షతన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మహిళా శిశు సంక్షేమశాఖ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో డివిజన్ స్థాయి లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలు తీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆడ శిశువు పట్ల వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నివారించేందుకు ప్రభుత్వం చట్ట పరమైన చర్యలను చేపట్టిందన్నారు. వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు జరపాలన్నారు. గ్రామస్థాయిలో అనధికారికంగా జరుగుతున్న అబార్షన్లను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్కానింగ్ సెంటర్లు రెన్యువల్ కోసం డివిజన్ స్థాయి కమిటీకి పంపిస్తే ఆమోదించిన దరఖాస్తులను జిల్లాస్థాయి కమిటీకి నివేదిస్తామన్నారు. స్కానింగ్ సెంటర్లలో చట్టానికి సంబంధించిన వాల్ పోస్టర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో సీహెచ్‌వీ భరతలక్ష్మి మాట్లాడుతూ లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రసూతి వైద్య నిపుణురాలు మాధురి, చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ వీపీపృథ్వీరాజ్, రేడియాలజిస్టు డాక్టర్ భరత్, పట్టణ సీఐ పి.వీరబాబు, లీగల్‌సెల్, ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

నడింపల్లి కుటుంబీకులకు ఎమ్మెల్యే దాట్ల పరామర్శ



సత్యవతిదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

అల్లవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోడూరుపాడులో నడింపల్లి సత్యవతిదేవి మృతితో సతీ వియోగంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ నేత ఎస్‌కేబీఆర్ కళాశాల చైర్మన్, సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజు ను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్సీ లు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ గురువారం పరామర్శించారు. నిమ్మకాయల జగ్గయ్యనాయుడు, చిక్కాల గణేష్, వేగిరాజు వెంకట్రాజు, దాట్ల గోపిరాజు, బండిగుప్తాపు సత్తిబాబు, డీఎస్ఎన్ రాజు, జనసేన నేత కంకిపాటి వీరబాబు, బీజేపీ నేత సుంకర సాయి, మాకిరెడ్డి సత్తిబాబు, కూటమి నాయకులు పరామర్శించారు.

హిందూ దేవాలయాలకు విముక్తి కల్పించడమే లక్ష్యం కావాలి

- భువనేశ్వరి పీఠాధిపతి భారతీస్వామీజీ



కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో స్వామీజీ, బాలబాలాజీని దర్శించుకున్న స్వామీజీ

అమలాపురం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి హిందూ దేవాలయాలకు విముక్తి కల్పించడమే లక్ష్యంగా హిందువులంతా సమష్టిగా ముందుకు సాగాలని భువనేశ్వరి పీఠం పీఠాధిపతి శ్రీకమలానందభారతీస్వామిజీ చెప్పారు. అమలాపురం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో హైందవ శంఖారావం విజయవంతం చేసేందుకు గురువారం ముందస్తు సమావేశం నిర్వహించారు. జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని చెప్పారు. దేవాలయాలను ప్రభుత్వం నుంచి విడిపించడం పెద్ద కష్టమైన పని కాదని గుర్తు చేశారు. ప్రతీ ఇంటి నుంచి ఒకరు హైందవ శంఖారావం సభకు తరలిరావాలని కోరారు. ఆర్ఎస్ఎస్ సంఘ్ చాలక్ గోదశి గంగరాజు, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, భజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు శిరంగు నాయుడు, ఊటుకూరి సాంబయ్య, నందూరి శ్రీరామ్, ఉపద్రష్ట మహేంద్రాదిత్య, సంతోష్‌శాస్త్రి పాల్గొన్నారు.

బాలబాలాజీని దర్శించుకున్న స్వామీజీ

మామిడికుదురు : అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారిని విజయవాడ సమీపంలో గల భువనేశ్వరి పీఠానికి చెందిన కమలానంద భారతీ స్వామీజీ గురువారం దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహింప చేశారు. అనంతరం వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ హైందవ ధర్మాన్ని కాపాడితే అది మిమ్మల్ని కాపాడుతుందని భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. అర్చకులు, ఆలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయంలో డెల్టా ప్రాజెక్టు డైరెక్టర్ పూజలు



గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న సూపరింటెండెంట్ విజయసారథి

అంతర్వేది, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ గురువారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేద పండితులతో మహదాశీర్వచనం జరిపించారు. అనంతరం డెల్టా చైర్మన్‌కు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ సూపరింటెండెంట్ విజయసారథి అందించారు. కార్యక్రమంలో ముప్పర్తి నాని, తాడి సత్యనారాయణ, చాగంటి స్వామి, పోతురాజు కృష్ణ, తిరుమాని ఆచార్యులు మందపాటి వెంకటేశ్వర్లు, పోతురాజు వెంకటకృష్ణ, వనమాలి మూలాస్వామి, తాడి మోహన్‌బాబు, శంకరగుప్తం నాని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, మంకీ క్యాప్‌ల పంపిణీ



బండారులంకలో విద్యార్థులకు మంకీ క్యాప్‌లు, పుస్తకాలు పంపిణీ చేసిన శ్యామ్ జాదూగర్

అమలాపురం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బండారులంక శివారు చినచంద్రపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ మోహిత్, డాక్టర్ సాయిసీత మంకీ క్యాప్‌లు, పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. మార్చి 12న మోహిత్, సాయిసీతల వివాహం సందర్భంగా వంద సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే లక్ష్యంతో ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు ప్రఖ్యాత ఇంద్రజాలికుడు చింతా శ్యామ్‌జాదూగర్ తెలిపారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర కన్వీనర్ ఉప్పుగంటి భాస్కరరావు, ఉప్పుగంటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

కిటకిటలాడిన వాడపల్లి ఆలయం

ఆత్రేయపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే స్వామివారికి తీర్థపు బిందెతో గోదావరి జలాలను తీసుకువచ్చి స్నపన మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేదపారాయణం జరిపారు. నోము ఆచరించిన పలువురు భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి ఒకరోజు ఆదాయం రూ.3,54,604 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



నూకాంబికా అమ్మవారి ఆలయంలోని ప్రాకార మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. దీనికి ప్రభుత్వంతో పాటు భక్తుల సమష్టి కృషి అవసరం అన్నారు. అమ్మవారి ఆలయంలో రూ.1.60 కోట్లతో నిర్మించిన ప్రాకారం మండపాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఆలయం వద్ద గనిపోతురాజు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జరిగే ఉత్సవాల్లో లక్షలాదిగా వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజు, సర్పంచ్ మార్గాని కరుణ, నాయకులు వైట్ల శేషబాబు, దండంగి మమత, గన్ని వెంకట్రావు, వైట్ల గంగరాజు, చింతలూరు ఫణి, ఎంపీడీవో ఎ.రాజు పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కొత్తూరు-వెదురుమూడి రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అధ్వానంగా ఉన్న కొత్తూరు-వెదురుమూడి రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మతులు ప్రారంభించారు. వీటి మరమ్మతులకు రూ.40లక్షలు మంజూరు కావడంతో గురువారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యా నందరావు వీటి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రోడ్డు పనులు తక్షణం ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. నియోజకవర్గంలో రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేసి గుంతలు లేకుండా చేయడానికి నిధులు కేటాయించారన్నారు. రానున్న సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థల రక్షణకు పోరాడాలి



సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశంలో సామాజిక న్యాయం, లౌకిక వాదం, ప్రజాస్వామ్య వ్యవస్థల రక్షణకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు పోరాడాలని సీపీఐ సీనియర్ నాయకులు పి.నరసింహారావు, పి.రాము, వి.గోపాలరావు పేర్కొన్నారు. ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం గురువారం డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనంలో జరిపారు. ముందుగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకుడు పి.నరసింహారావు ఆవిష్క రించిన అనంతరం మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు పోరాటం చేయాలని కోరారు. ప్రజా నాట్యమండలి కళాకారుల గేయాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రజా సంఘాల నాయకులకు పార్టీ తరఫున వై.దుర్గాప్రసాద్ అభినందనలు తెలిపారు.

రాక్‌చర్చిలో క్రిస్మస్ వేడుకలు



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ద్రాక్షారామ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఆదివారపుపేటలో రాక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. చర్చి పాస్టర్ బిషప్ కనికెళ్ల ఆనందకుమార్ క్రిస్మస్ సందేశం అందించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. చిన్నారులు, యువతీ, యువకుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గ్రామంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేమ్స్ పల్లి ప్రతాప్, పలివెల సుధీర్‌కుమార్, కనకరత్నం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాచరలో రెవెన్యూ సదస్సు

కపిలేశ్వరపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచరలో గురువారం రెవెన్యూ సదస్సు జరిపారు. సర్పంచ్ వాసంశెట్టి సునీత అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో కామేశ్వరరావు, తహసీల్దార్ పి.చిన్నారావు పాల్గొని మాట్లాడారు. గ్రామంలో రెవెన్యూ సదస్సులపై ర్యాలీ జరిపి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుడాల జయబాబు, వాసంశెట్టి విష్ణుమూర్తి, గ్రామ కార్యదర్శి చినబాబు, ఆర్ఐ అర్జమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ చిన్నారావు

మండపేట రూరల్ ఎస్ఐగా బుజ్జిబాబు

మండపేట, డిసెంబరు, 26(ఆంధ్రజ్యోతి) మండపేట రూరల్ ఎస్ఐగా బుజ్జిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సురేష్‌బాబు సస్పెండ్‌కు అయిన నేపథ్యంలో ఆయన స్థానంలో ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు బుజ్జిబాబు రాయవరం ఎస్ఐగా పనిచేశారు. బదిలీ అనంతరం ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేస్తూ ఇక్కడ రెగ్యులర్ ఎస్ఐగా వచ్చి నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. నూతన బాధ్యతలు చేపట్టిన బుజ్జిబాబు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.



కంప్యూటర్ పితామహుడు చార్లెస్ బాబేజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

టెక్నాలజీని విద్యార్థులు అందిపుచ్చుకోవాలి

కొత్తపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. గురువారం కళాశాల ఆవరణలో కంప్యూటర్ పితామహుడు చార్లెస్ బాబేజ్ జయంతిని జరిపారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. కంప్యూటర్ ఆవిష్కరణలో చార్లెస్ బాబేజ కృషిని కొనియాడుతూ విద్యార్థులు టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, డాక్టర్ అంకంరావు, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ శ్రీనివాసులు, కడలి ప్రసాద్, కావ్య, విమలత, భవాని తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

రావులపాలెం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈతకోట జడ్పీ పాఠశాల విద్యార్థిని యార్లగడ్డ లావణ్య జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు నెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ పళ్లా శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూలులో జరిగిన అండర్-16 బాలుర, బాలికల పోటీల్లో లావణ్య జాతీయస్థాయికి ఎంపికైందన్నారు.

స్లాబు పెచ్చులూడితే ఇక అంతే..

• శిథిలమైన సాంఘిక సంక్షేమ హాస్టల్‌లోనే సచివాలయ సిబ్బంది విధులు • భయాందోళనతో గడుపుతున్న వైనం

ఆత్రేయపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం సాంఘిక సంక్షేమ హాస్టల్ మూతపడటంతో శిథిలావస్థకు చేరింది. ఈ భవనంలోనే సచివాలయం ఏర్పాటు చేసి సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు పక్కనే నిర్మించిన సచివాలయ భవనం అసంపూర్తిగా వదిలేశారు. కొంత కాలం నుంచి శిథిల భవనంలోని గోడలు, పైశ్లాబు నుంచి పెచ్చులు ఊడిపడుతూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. పదేళ్ల నుంచి ఖాళీగా ఉంటున్న ఈ భవనంలోకి పంచాయతీ భవనాన్ని కూల్చివేయడంతో 1, 2 సచివాలయ సిబ్బంది ఇందులో విధులు నిర్వహిస్తున్నారు. అప్పుడప్పుడు స్లాబు పెచ్చులు పడుతుండటంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్యదర్శి గదిలోని కంప్యూటర్లపై బరకాలు కప్పి విధులు నిర్వహిస్తున్నారు. స్టేషనరీ పాడవకుండా బీరువాలపై సంచులతో కాపాడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడి సిబ్బంది రోజూ బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. అప్పటి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి హడావిడిగా సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ భవనంలో కొన్ని పనులు చేపట్టాల్సి ఉండగా అలాగే వదిలేశారు. నూతన సచివాలయంలో పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



ఆత్రేయపురం సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో సచివాలయం. (ఇన్‌సెట్లో) స్లాబ్ పెచ్చులు ఊడిపోయిన దృశ్యం



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న నాయకులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాంత్రం గ్రామ దేవత దొడ్డిగంగమ్మ ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠను ఘనంగా జరిపారు. గ్రామానికి చెందిన ఉంగరాల అప్పారావు నాయుడు 1994లో నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం చేపట్టారు. ఆలయ ధర్మకర్త ఉంగరాల అప్పారావు నాయుడు కుమారులు భీమశంకరం నాయుడు, రామచంద్రరావు నాయుడులు ఆధ్వర్యంలో గ్రామస్తులు, దాతల సహకారంతో నిర్మాణం చేశారు. గురువారం ఆలయాన్ని ప్రారంభించి, నూతన విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ చేశారు. సర్పంచ్ చాగంటి సాంబశివరావు, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్న సమారాధనలో భక్తులు పాల్గొన్నారు.

చెరువునీరు కలుషితంపై ఫిర్యాదు

మండపేట, డిసెంబరు, 26(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి పంచాయతీ పరిధిలో గల చేపల చెరువులో వ్యర్థాలు వేయటం వల్ల సమీపంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు టి.మురళీకృష్ణ గురువారం మండపేట తహశీల్దార్ తేజేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. పాఠశాల సమీపంలోని చెరువులో కోళ్ల వ్యర్థాలు చేపలకు ఆహారంగా వేస్తున్నారన్నారు. వాటి యజమానులపై చర్యలు తీసుకుని విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని తహశీల్దార్‌ను ఆయన కోరారు.



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

నెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఆత్రేయపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మహాత్మాగాంధీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. కర్నూలులో ఈ నెల 21, 22, 23 తేదీల్లో జరిగిన 10వ సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు రంజిత్‌కుమార్, సత్యకుమార్, హర్షవర్ధన్, ఆదినారాయణ, వెంకటేష్ ప్రతిభ కనబరిచారు. గురువారం హైస్కూల్‌లో సెక్రటరీ, కరస్పాండెంట్ పీఎస్ రాజు, ఎంఈవోలు వరప్రసాద్, సాహెబ్, మహర్షి విద్యా సంస్థల డైరెక్టర్ రామరాజు, పీఈటీలు క్రీడాకారులను అభినందించారు.

నేడు విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ శ్రేణుల ఆందోళన

మండపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ వైసీపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో నేడు నిరసన తెలుపుతున్నామని ఆ పార్టీ శ్రేణులు తెలిపారు. మండపేటలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.

ఆసుపత్రి కమిటీ మాజీ చైర్మన్ మునేశ్వరమ్మ మృతి

ఆలమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ మాజీ చైర్మన్ చల్లా మునేశ్వరమ్మ(78) గురువారం మృతి చెందారు. ఈమెకు ముగ్గురు కుమారులు కాగా కుమారుడు చల్లా ప్రభాకరరావు కాపు సంఘం మండల అధ్యక్షుడిగాను రాష్ట్ర కాపు రిజర్వేషన్ పోరాట సమితి జేఏసీ సభ్యుడిగా పనిచేశారు. మునేశ్వరమ్మ మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

వీఆర్వో నూతన సంఘం ఎన్నిక

రావులపాలెం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాలకు సంబంధించిన వీఆర్వోల నూతన సంఘాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పి.పెద్దరాజు, సెక్రటరీగా పెమ్మాడి కనకదుర్గలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.



ధవళేశ్వరం, బొబ్బర్లంక మత్స్యకార సంఘాలతో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

శాంతి భద్రతలకు విఘాతం లేకుండా వేట సాగించాలి

డీఎస్పీ గోవిందరావు

కొత్తపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక-ధవళేశ్వరం సరిహద్దుల్లో కాటన్ బ్యారేజీ వద్ద మత్స్యకార సంఘాలు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చేపలు, రొయ్య సీడ్ వేట సాగించాలని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు సూచించారు. ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం ఆయా గ్రామాల ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులతో సమావేశం జరిపారు. ఇరువర్గాలతో చర్చలు జరిపిన అనంతరం రొయ్య సీడ్ వేటకు ఘర్షణ పడకుండా ఎవరి పరిధిలో వారు వేట సాగించాలన్నారు. ఏదైనా సమస్య వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము, తహశీల్దారు రాజేశ్వరరావు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ కెమేరాల ఏర్పాటు



తామరపల్లిలో కెమేరాలు ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ జానీబాషా

కె.గంగవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నేరాలు అదుపు చేయడానికి, నిందితులను త్వరగా పట్టుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలోని ఊరి ఎంట్రన్స్, వెలుపల మార్గాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. నూతన టెక్నాలజీతో సీసీ కెమేరాల విజువల్స్ ఖచ్చితంగా కనిపిస్తున్నాయి. దీంతో గ్రామాల్లోకి వచ్చే వారి కదలికలు ఇందులో నమోదవుతుంది. దొంగలను వెంటనే పట్టుకునే అవకాశం కలుగుతుంది. కె.గంగవరం మండలంలో 50 నుంచి 60 కెమేరాలు ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ ఎస్‌కె జానీబాషా చెప్పారు. వీటి ఏర్పాటుకు గ్రామాల్లోని స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఇప్పటికే కెమేరాల ఏర్పాటు దాదాపు పూర్తి కావచ్చిందని అన్నారు. ఇకపై గ్రామాలు పోలీసుల నిఘా నీడలో ఉండనున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్రాక్షారామ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ 33/11 కెవి సబ్‌స్టేషన్ తాళ్లపొలం ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు తెలిపారు. ఈ నేపథ్యంలో నెలపర్తిపాడు, వెలంపాలెం, తాళ్లపాలెం, జగన్నాయకులపాలెం, ఉట్రుమిల్లి, మామిడిగుంట గ్రామాలకు నేటి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

రాయవరం: రాయవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.



బ్రాంచ్‌ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

కిరణ్ కంటి ఆసుపత్రి బ్రాంచ్ ప్రారంభం

ద్రాక్షారామ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కిరణ్ కంటి ఆసుపత్రి సేవలు ప్రశంసనీయమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అన్నారు. గురువారం ద్రాక్షారామలో ఆర్టీసీ బస్‌స్టాండు వద్ద కిరణ్ కంటి ఆసుపత్రి మార్పు చేసిన బ్రాంచిని పోలిశెట్టి చంద్రశేఖర్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ ప్రారంభించారు. కిరణ్ కంటి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టరు, పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలు ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తోటకృష్ణ, రవి, కిరణ్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

రాయవరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భార్య వియోగంతో బాధపడుతున్న వైసీపీ సీనియర్ నాయకుడు మంతెన అచ్యుత రామరాజును గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. ఆయనతో పాటు పలువురు నేతలు పరామర్శించారు.



కపిలేశ్వరపురం: కేదార్లంకలో రంగ వర్ధంతిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



కొత్తపేట మండలం వాడపాలెంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

పేద వర్గాల అభ్యున్నతికి రంగా కృషి

వర్ధంతి సభలో వక్తలు



రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడులో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

కపిలేశ్వరపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి తన ప్రాణాన్ని పణంగా పెట్టిన రంగా జీవితం నేటి తరాలకు ఆదర్శనీయమని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని కేదార్లంకలో నిర్వహించిన వంగవీటి మోహన రంగ వర్ధంతిలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా రంగా విగ్రహానికి నివాళులర్పించారు. మండలంలోని అంగర, కోరుమిల్లి, తదితర గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, రంగా అభిమానులు ఆయా కార్యక్రమాల్లో మాట్లాడారు. రంగా విగ్రహాలకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: వంగవీటి మోహనరంగ వర్ధంతిని మండలంలోని పలు ప్రాంతాల్లో జరిపారు. ఈ సందర్భంగా రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాడపాలెం పంచాయతీ సెంటర్ వద్ద రంగా విగ్రహానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నివాళులర్పించారు. కొత్తపేట పాతబస్టాండ్ సెంటర్, అవిడి గ్రామంలోని రంగా విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, కంఠంశెట్టి శ్రీను, ఎం.సుబ్బారావు, ముద్రగడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: దివంగత వంగవీటి మోహన్ రంగా వర్ధంతిని ఆలమూరు మండలంలో గురువారం నిర్వహించారు. ఆలమూరులో కాపు సంఘం మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు అధ్వర్యంలో కాపు సంఘం నాయకులు నివాళులర్పించారు. కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని సంధిపూడి, పినపళ్ల, జొన్నాడ, చొప్పెల్ల, మూలస్థానం, తదితర గ్రామాల్లో రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ గ్రామంలో వంగవీటి రంగా వర్ధంతిని నిర్వహించారు. ప్రధాన కూడలిలో ఉన్న రంగా విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సలాది ప్రకాష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్.రామకృష్ణ, చవాకుల వెంకటేశ్వరరావు, సలాది రాంబాబు, తోట చినమాచర్రావు, బండారు బద్రి తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం (ద్రాక్షారామ): స్వర్గీయ వంగవీటి మోహనరంగా వర్ధంతి పురస్కరించుకుని గురువారం పలువురు నివాళులర్పించారు. పట్టణంలోని రంగా విగ్రహం వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కాపు సంఘం గౌరవ అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు, అధ్యక్షుడు నారపరెడ్డి బలరాం, కౌన్సిలరు అంకం శ్రీనివాస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు పోతంశెట్టి గోపాలకృష్ణ, పెంటపాటి శ్రీనివాస్, వైసీపీ పట్టణ అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీధర్, న్యాయవాది పోలిశెట్టి శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని సోమేశ్వరం గ్రామంలో రంగా వర్ధంతిని గురువారం కాపునేతలు జరిపారు. గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న రంగా విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో పసలపూడి నీటి వినియోగదారుల సంఘం టీసీ శాకా కోటేశ్వరరావు, జనసేన నాయకులు శాకా నాగేంద్ర, గరగ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలో రంగా వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలి, మెర్లపాలెం, నార్కెడిమిల్లి, వెలిచేరు, లొల్ల, వాడపల్లి, ఉచ్చిలి తదితర గ్రామాల్లో రంగా విగ్రహాలకు నాయకులు, యువకులు పూలమాలలు వేశారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ బస్టాండు వద్ద వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద పలువురు కాపునేతలు నివాళులర్పించారు. జడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకాబాబి, సరంచ్‌లు అనిశెట్టి రామకృష్ణ, పెమ్మిరెడ్డి దొరబాబు, పొట్టిపోతుల రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వెంకటేశ్వరరావు, డాక్టర్ రాంబాబు, కోటిపల్లి అబ్బు, జనసేన నాయకుడు నామా వెంకన్నబాబు, కంచర్ల చక్రి, చల్లా శ్రీను తదితరులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మండపేట: స్వర్గీయ రంగా వర్ధంతిని పురస్కరించుకుని కరాచి సెంటర్‌లో వున్న రంగా విగ్రహానికి పట్టణ కాపు అభ్యుదయ సంఘ అధ్యక్షుడు జిన్నూరి సాయిబాబా, సహచరులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏడిద బైపాస్ రోడ్డులో వున్న రంగా విగ్రహానికి రంగా మిత్ర మండలి అధ్యక్షుడు పడాల సతీష్ నివాళులర్పించారు. ఏడిదలో కూడా రంగా వర్ధంతిని జరిపారు. కేశవరం, ద్వారపూడి తదితర గ్రామాల్లో కూడా రంగా వర్ధంతి సందర్భంగా స్థానిక రంగా మిత్ర మండలి సభ్యులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రావులపాలెం: కాపు ఉద్యమనేత వంగవీటి మోహనరంగ వర్ధంతిని ఆయన అభిమానులు ఘనంగా జరిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముమ్మిడివరప్పాడు, గోపాలపురం జాతీయ రహదారి సెంటర్ వద్ద రంగా విగ్రహానికి తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ అభిమానులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మైగాపుల గురవయ్య నాయుడు, నందం వీరవెంకట సత్యనారాయణ, యాళ్ల మునేశ్వరరావు, అడపా శేషు, శివగోవిందు, మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

రాయవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాయవరం సాయితేజా విద్యానికేతన్ టెన్త్ విద్యార్థులకు దాత వితరణతో గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి కుమారుడు సబ్బెళ్ల సురేష్‌రెడ్డి మూడవ వర్ధంతిని పురస్కరించుకుని సురేష్‌రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు, ధాత్రి ట్రస్టు చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన కుమారుడు సురేష్‌రెడ్డి జ్ఞాపకార్థం తన స్నేహితులు ట్రస్టు ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ ప్రెసిడెంట్ పులగం శివారెడ్డి, కార్యదర్శి చింతా ప్రభాకరరెడ్డి, జాయింట్ సెక్రటరీ మల్లిడి శివకుమార్‌రెడ్డి, ఎన్.జగదీష్‌రెడ్డి, కర్రి సతీష్‌రెడ్డి, కర్రి తేజా పవన్ మణికంఠరెడ్డి, కర్రి శ్యాం ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.